www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 18 అక్టోబర్ 2023

'ఆరోగ్య సురక్ష'లో 24 గ్రామాల్లో 9,046 ఓపి నమోదు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద మంగళవారం 24 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో సాయంత్రం ఐదు గంటల వరకు 9,046 ఓపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 4,916 మంది, పురుషులు 4,130 మంది ఉన్నారని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం 124 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేసినట్లు వివరించారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 9,046 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు. కంటి వెలుగు శిబిరంలో 1,459 ఓపి నమోదైందన్నారు.

'ఉపాధి'ని కాపాడుకుందాం..!

- నేడు సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు
- పనిదినాలు, వేతన పెంపే ప్రధానాంశాలు
- పట్టణప్రాంతాల్లో ఉపాధి పనులపైనా డిమాండ్
- మోడీ హయాంలో ఉపాధిహామీ చట్టం నిర్వీర్యం
- ఇప్పటికే అలవెన్సులు, సదుపాయాల రద్దు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ అధికారంలోకొచ్చాక పేదల కడుపు నింపుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ముందుకు సాగుతోంది. ఇప్పటికే కూలీలకు ఇచ్చే అలవెన్సులు, సదుపాయాలను రద్దు చేయడంతోపాటు వార్షిక బడ్జెట్‌లో భారీగా నిధులు కోత పెడుతూ ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడంతోపాటు పనిదినాలు, వేతనాలు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి పనులు చూపాలనే డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఉపాధి చట్టాన్ని కాపాడుకుందాం అంటూ బుధవారం ఏలూరులోని కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు జరగనుంది. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడనున్నారు. 2005లో వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా ఉపాధిహామీ చట్టం వచ్చింది. ఇది పేదలైన వ్యవసాయ కార్మికులకు ఎంతగానో అండగా నిలిచింది. వలసలు తగ్గుముఖం పట్టాయి. దీంతో భూస్వాములకు కళ్లుకుట్టాయి. ఫలితంగా ఈ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భూస్వాములు ఒత్తిడి తేవడం ప్రారంభించారు. దీనికి తలొగ్గిన బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి పూనుకుంది. ప్రతియేటా బడ్జెట్‌లో నిధులకు కోత పెడుతూ ఉపాధి చట్టాన్ని దెబ్బతీసేందుకు పూనుకుంది. 2022-23లో రూ.లక్ష కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే 2023-24లో బడ్జెట్‌ను రూ.70 వేల కోట్లకు కుదించింది. ఒక్క ఏడాదిలో రూ.30 వేల కోట్లకు కోత పెట్టింది. పని చేసేచోట టెంట్లు, నీళ్లు, మెడికల్ కిట్లు వంటి వాటిని ఇవ్వడం లేదు. పార, గునపం వంటి వాటికి సొమ్ములివ్వకుండా ఎగనామం పెట్టింది. దీంతో ఉపాధికూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పరిస్థితి గమనిస్తే ఉపాధిహామీ చట్టం ఏవిధంగా నిర్వీర్యమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 8.38 లక్షల మందికి ప్రభుత్వమే జాబ్‌కార్డులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న చట్ట నిబంధనల ప్రకారం ఏడాదికి వందరోజులు పనిదినాలు కల్పించాల్సి ఉంది. రోజువారీ వేతనం రూ.275గా ప్రభుత్వం నిర్ణయించింది. రెండు జిల్లాల్లోనూ ఆక్వా సాగు పెరిగిపోవడంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకడం లేదు. దీంతో ఉపాధి పనుల కోసం కూలీలు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. సరాసరిన కూలీలకు ఏడాదికి 60 రోజులు పని కల్పించడమే గగనంగా మారింది. రోజుకు రూ.225లోపే కూలి పడుతోంది. ఇది చాలదన్నట్లు రెండుపూటలా పని విధానం తీసుకొచ్చి ఉపాధి కూలీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గడిచిన వేసవిలో ఎండవేడిమి తట్టుకోలేక ఉపాధి కూలీలు వడదెబ్బకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా చట్టాన్ని రద్దు చేస్తే జనం నుంచి వ్యతిరేక వస్తుందనే భయంతో చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీసర్కార్ బరి తెగించింది. పనుల్లేక అల్లాడుతున్న వ్యవసాయ కార్మికులకు పని కల్పించేందుకు మరింత కృషి చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సైతం తలాడించడంతో ఉపాధికూలీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనిదినాలు ఏడాదికి 200కు పెంచడంతోపాటు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని ఉపాధికార్మికులు కోరుతున్నారు. కరోనా తర్వాత పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి లేకుండాపోవడంతో కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. ఉపాధి పనుల్లో యంత్రాలు, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి, వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఉపాధి హామీ చట్టం పేదలకు అండగా నిలబడుతుంది. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మోడీ సర్కార్ తీరును నిరసిస్తూ అందరినీ ఏకం చేసేందుకు సిపిఎం ముందడుగు వేసింది. అందుకోసం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తూ అందరిని సంఘటిత పరిచేందుకు పూనుకుంది.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపరచాలి

ఎ.రవి, సిపిఎం జిల్లాకార్యదర్శి

'కరోనా తర్వాత ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి తరుణంలో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపర్చకుండా నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పూనుకుంది. నిధుల్లో కోత పెట్టడంతో ఈ ఏడాది సంబంధించి ఇప్పటికే నిధులు అయిపోయాయి. ఇంకా ఈ ఏడాది పూర్తవ్వడానికి ఆరు నెలల వరకూ సమయం ఉంది. కూలీలకు పనులు లేకపోతే ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టపరిచి ఏడాదికి 200 పని దినాలు, రూ.600 వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పట్టణాల్లోనూ ఉపాధి పనులు కల్పించాలి. కేరళలో ఈ విధానం అమలవుతోంది.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం

మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో పారిశుధ్య కార్మికులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం కింద పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత అధికారులపై ఉందన్నారు. వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన చెప్పులు, రెయిన్ కోట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వారికి ఇఎస్ఐ కార్డులు అందించే విషయాన్నీ పరిశీలించాలని, పెండింగులో ఉన్న హెల్త్ అలవెన్సు అందించాలని, చనిపోయిన, రిటైర్డ్ కార్మికులకు పిఎఫ్ అందించాలన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సురక్షను పటిష్టంగా అమలు చేయాలి

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో మున్సిపాల్టీల్లోని ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శిబిరాలకు ఆయా ప్రాంతాల్లోని ప్రతిఒక్కరూ హాజరయ్యేలా వాలంటీర్లు, ఎఎన్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏలూరు నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి కమిషనర్లు అబ్దుల్ రషీద్, భవానీ ప్రసాద్, రాంబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిఎల్‌డిఒ రమణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కొనసాగిన దీక్షలు

రిలే దీక్షలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కుక్కునూరు

వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని, విద్యుత్ కోతలను అరికట్టి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు పేరుతో మండలంలో నిలిపిన అభివృద్ధి పనులను ప్రాజెక్టుతో సంబంధం లేకుండా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో నేతలు పట్లా లక్ష్మయ్య, పుల్లు, మహబూబ్ పాషా, ఎస్.లక్ష్మణరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

ఉచిత మందులు అందిస్తున్న శ్రీనివాసరావు, వెంకట్రావు

జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' భేష్

మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల రూరల్

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణ బాగుందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ద్వారకాతిరుమల-2 గ్రామ సచివాలయ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ఆయన మంగళవారం ఎంఎల్ఎ తలారి వెంకట్రావుతో కలిసి సందర్శించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన పలు వైద్య, ల్యాబ్ పరీక్షలు, జగనన్న కంటివెలుగు, ఉచిత మందుల పంపిణీని సందర్శించారు. మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీల సేవలను కొమ్మినేని అభినందించారు. అనంతరం గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వం కొనసాగించే సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికీ అవసరమేనన్నారు. ప్రతి జిల్లాలోనూ అభివృద్ధి పనులకు జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ఇప్పటివరకు 97 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శామ్యూల్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు చెలికాని రాజబాబు, స్థానిక ఎంపిటిసిలు, ఎంపిడిఒ తిరుపతిరావు, సిడిపిఒ ఆర్.బ్యూలా, సూపర్‌వైజర్ టి.మేరీ, వైసిపి మండల కన్వీనర్ వాసు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పోలవరం'లో ఎస్‌పి తనిఖీలు

మాట్లాడుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సంబంధిత వివరాలను సిఐ విజయబాబుని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ ఏలూరులో దళిత మహిళపై యాసిడ్ దాడి కేసులో 21 రోజుల్లోగా ఛార్జిషీట్ వేసి కేవలం 117 రోజుల్లో యాసిడ్ దాడికి కారకులైన ముగ్గురికి జీవిత ఖైదు విధించేలా చర్యలు తీసుకున్నామని, పోలీస్ చరిత్రలో ఇదే మొదటిసారని, ఇది సామాన్య విషయం కాదని అన్నారు. మహిళల పట్ల నేరాలు చేసేవారు ఆలోచించాలని, దుర్మార్గంగా వ్యవహరించే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి మూలాలు లేవని, ఎక్కడికక్కడ గంజాయి, నాటుసారా క్రయవిక్రయాలను నియంత్రించామని అన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలవరం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరతపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్రా'

స్పోర్ట్స్ కిట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

స్పోర్ట్స్ కిట్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

క్రీడల పట్ల యువతను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు మాసంలో రాష్ట్ర మంతటా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి సంబంధించి జిల్లాకు వచ్చిన స్పోర్ట్స్ కిట్స్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు చూపించారు. క్రీడా పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పోటీలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డిశంబరు మాసంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశామని తెలిపారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ వెంకటేష్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన క్రీడాకారులు అండర్-19 బాలురు, బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ క్రీడలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను క్రీడాకారులు కలిసి వారు హ్యాండ్‌బాల్ క్రీడలలో సాధించిన అవార్డును కలెక్టర్‌కు చూపించారు. ఈ క్రీడలో ఎ.శ్రీరామ్ గోల్డ్ కీపర్ కీ, బెస్ట్ గోల్డ్ కీపర్ అవార్డు బహూకరించారని జిల్లా క్రీడాధికారి బి. శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్ బాల్‌లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయస్థాయిలో ప్రథమ స్థానం సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాచీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, కోచ్ పి.ఉదయ్ కిరణ్, జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ పాల్గొన్నారు.

వివిప్యాట్స్ తనిఖీ సిబ్బంది గుర్తింపుకార్డు ధరించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాకు కేటాయించిన ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు నియమించిన అధికారులు, సిబ్బంది వారికి ఇచ్చిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా ధరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం వివిప్యాట్స్‌ల ఫస్ట్ చెకింగ్ రెండో రోజైన మంగళవారం వివిప్యాట్స్ గొడౌన్‌లో నిర్వహిస్తున్న తనిఖీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. తొలుత సిబ్బంది హాజరు పట్టికను, సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోను ఐడి కార్డులు లేకుండా అనుమతించొద్దని, సెల్‌ఫోన్లను గొడౌన్ పరిసర ప్రాంతాల్లోకి తీసుకురాకుండా పర్యవేక్షించాలని డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లును ఆదేశించారు. గొడౌన్ పరిసరాలు పరిశుభ్రతతో ఉండాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గొడౌన్‌లో నిర్వహిస్తున్న వివిప్యాట్స్ చెకింగ్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర ఉన్నారు.

117వ రోజుకు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. 117వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం స్థానిక 34వ డివిజన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు నేరుగా లబ్ధిని అందిస్తున్నామని తెలిపారు. ఏలూరు నగర ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే లక్ష్యంతో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామన్నారు. తమ్మిలేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం ద్వారా ఏలూరు నగరవాసులకు తమ్మిలేరు వరద ముంపు నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించామన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, అర్హత ఉండి కూడా పథకాలు పొందని వారికి సంబంధిత సమస్యలను సరిచేసి, పథకాలు పొందేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, మేయర్ షేక్ నూర్జహాన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు, సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గర్భిణీ స్త్రీలకు, రక్త హీనత గల పిల్లలకు పోషకాహారం అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజా తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అక్షజా న్యూట్రిషన్ ప్రొడక్ట్‌పై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, రక్త హీనత గల పిల్లలకు ప్రోటీన్ మిక్స్ న్యూట్రిషన్ ఫుడ్ అందించడం ద్వారా ఆరోగ్యంగా బలంగా ఉంటారని ఆమె అన్నారు. అదేవిధంగా రక్త హీనతతో బాధపడుతున్న, బరువు తక్కువ ఉన్న 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలకు 5 నెలల పాటు ఈ న్యూట్రిషన్ ఫుడ్‌ను అందించడం ద్వారా ఎనీమియా బారి నుంచి కాపాడవచ్చని సూచించారు. స్త్రీ శిశ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెయింట్ థెరిస్సా కళాశాల వారు ఈ ప్రొడక్ట్‌ను సంయుక్తంగా నిర్వహిస్తున్నారని, బలహీనంగా ఉన్న వారికి ఈ ఫుడ్ అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కె.విజయలక్ష్మి, సెయింట్ థెరిస్సా కళాశాల ప్రిన్సిపల్ పద్మజ, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి, సిడిపిఒ తులసి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, మండలం వ్యాప్తంగా ఉన్న హెల్త్, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ అందక కార్డుదారుల అవస్థలు

3 నెలలుగా రేషన్‌కు కోత లబోదిబోమంటున్న ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ప్రతినెల ఎండియు వాహనం ఆపరేటర్ ద్వారా ఇంటింటా రేషన్ పంపిణీ చేయడం జరుగుతున్న విషయం తెలిసిందే. గత మూడు నెలలుగా ముదినేపల్లి-1 సచివాలయం పరిధి కార్డుదారులకు పూర్తిగా రేషన్ పంపిణీ జరగడంలేదంటూ కార్డుదారులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలుగా సూమారు 150 కార్డులకు రేషన్ పంపిణీ జరగడంలేదని కార్డుదారులు చెబుతున్నారు. దీంతో జనం రేషన్ కోసం ప్రతినెల పడిగాపులు కాస్తున్నారు. రేషన్ తక్కువగా రావడంతో ఆపరేటర్ గ్రామంలోని ఒకో ఏరియాలో ఒకోనెల 150 కార్డులకు రేషన్ నిలుపుదల చేస్తున్నాడు. రేషన్ ఇవ్వని కార్డుదారులు రేషన్ కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈరీతిన మూడు నెలలుగా గ్రామంలో రేషన్‌కోత విధించడం జరుగుతోంది. ముదినేపల్లిలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ముదినేపల్లి -1 సచివాలయంలో 750 కార్డులున్నాయి. వీటిలో 600 కార్డులకే రేషన్ విడుదల చేస్తున్నారు. మిగతా కార్డుదారులకు పైనుంచి రేషన్ రావడం లేదు. దీంతో ప్రతినెల 150 కార్డులకు రేషన్ కోత పడుతోంది. గ్రామంలో పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ జరగకపోవడంతో రేషన్ కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ముదినేపల్లి-2 సచివాలయంలోని కార్డుదారులందరికీ రేషన్ ఇస్తున్నారని, ముదినేపల్లి-1 సచివాలయానికి ఎందుకు రేషన్ కోత విధిస్తున్నారని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం రేషన్ డిపో డీలర్‌ను వివరణ కోరగా గత మూడు నెలలుగా 150 కార్డులకు పైనుంచి రేషన్ సరఫరా చేయడంలేదన్నారు. ఈ విషయమై పలుసార్లు సంబంధితాధికారులకు తెలియజేసినా రేపు, మాపు రేషన్ వస్తుందంటూ చెబుతున్నారే తప్ప రేషన్ మాత్రం రావడం లేదన్నారు. అందుజేత ప్రతినెల 150 కార్డులకు రేషన్ ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రజాశక్తి పిడిఎస్‌డిటి స్వర్ణలతను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో రేషన్ సరఫరా చేసి, పేదల ఆకలి బాధలు తీర్చాలని కార్డుదారులు కోరుతున్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

చాట్రాయి : మండలంలోని నరసింహారావు పాలెం, చనుబండ గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల వలన ఎండిపోయిన వరిపైరు సాగు రైతులను పంట నష్టం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తెలిపారు. నరసింహారావు పాలెం, చనుబండ గ్రామాలలో ఎండిపోయిన వరిపైరును వ్యవసాయ శాఖ ఎడి జి.విద్యాసాగర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన బోర్లలోని నీటి శాతం అడుగంటిందని, వర్షాలు లేకపోవడం వలన భూగర్భ జలాలు ఎండిపోయాయని తెలిపారు. 35 శాతం నీటి తేమ తగ్గిందన్నారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ యూనిట్ ఇన్సూరెన్స్ ద్వారా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడి బి.శివశంకర్, సర్పంచి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం, సిపిఐ నేతలు

రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ కౌలు రైతులకు సులభంగా పంట సాగుదారుల హక్కు కార్డులు జారీ చేయాలని, ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం కౌలు రైతులకు శాపంగా మారిందని విమర్శించారు. భూ యజమాని లిఖితపూర్వకంగా కౌలు ఒప్పందం రాసి ఇస్తేనే కౌలు గుర్తింపు కార్డులు ఇస్తామని చట్టంలో మెలిక పెట్టారని, దీనివలన కౌలురైతులకు నూటికి 25శాతం కూడా గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన చింతలపూడి ఏరియాలో మూడువేల ఎకరాలు పంట నష్టపోయిందని, వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయకుల లక్ష్మణరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన, ప్రకృతి విపత్తులు, చీడ పీడలు వచ్చి నష్టపోయిన పంటలకు పంటల బీమా అమలు చేసి, రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ ధర్నాలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, నాయకులు బళ్ళ కనకదుర్గారావు, బుగ్గల ప్రభాకర్, షేక్ మస్తాన్, ఎ.అప్పలరాజు, కె.శ్రీను, సుధారాణి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సమస్యలు రాజీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్యా, వైద్యం, జాతీయ ఉపాధి హామీ చట్టం, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన కేసులను ఈ శాశ్వత లోక్ అదాలత్ నందు అర్జీ చేసుకొని, పరిష్కరించుకోవచ్చని లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కోట దిబ్బలోని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనము నందు సభ్యులకు శాశ్వత న్యాయ పీఠం అందించే సేవలపైన, లీగల్ సర్వీసెస్ అందించే ఉచిత సేవలపైన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ఎటువంటి రుసుము వసూలు చేయబడకుండా సమస్యలు పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేయడం, సాక్ష్యులను విచారించి తీర్పు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ తీర్పులకు అప్పీల్ ఉండదని, కావున ప్రజలు సేవలలో లోపం జరిగిన, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ మెంబర్ రామ మోహన్ రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

చిన్నవెంకన్నను దర్శించుకున్న కొమ్మినేని

ద్వారకాతిరుమల రూరల్ : ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మంగళవారం సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సందర్శించారు. తొలుత ద్వారకాతిరుమలకు చేరుకున్న శ్రీనివాసరావుకు స్థానిక తహశీల్దార్ సతీష్, డిపిఆర్‌ఒ రామచంద్రరావు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. శ్రీవారి బంగారు వాకిలి గుండా స్వామివారిని, పద్మావతి అండాళ్ అమ్మవారులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఎఇ మెట్టపల్లి దుర్గారావు శ్రీనివాసరావుకు శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఛైర్మన్ వెంట ఒఎస్‌డి ఎస్.శ్రీనివాస్ జీవన్ వున్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం : పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పొందాలని స్థానిక సిఎస్‌టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు తెలిపారు. మంగళవారం కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ శాఖ ఆధ్వర్యంలో కళాశాల స్వర్ణోత్సవాలలో భాగంగా అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన జరగాలంటే ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ప్రజలు తెలుసుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తుల్లో మార్పు రావాలని కోరారు. ప్రతి వ్యక్తి పేదరిక నిర్మూలన చేయాలనే సంకల్పంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌పాల్ హార్టికల్చర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత, మెప్మా జంగారెడ్డిగూడెం ఏరియా కన్వీనర్ పి.నాగమణి, ఏలూరు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రత్నకుమారి, కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శివ, స్వయం సహాయక బృందాలు, మెప్మా ఏలూరు డిస్ట్రిక్ట్ సిబ్బంది, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల గృహనిర్బంధం తగదు

జంగారెడ్డిగూడెం : కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని టిడిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ప్రశ్నించారు. గృహనిర్బంధాలు తగవన్నారు. టిడిపి బిసి నాయకులు చలో రాజమండ్రి కార్యక్రమం నేపథ్యంలో పలువురు టిడిపి నాయకులను పోలీసులు గృహ నిర్బంధించారు. గత రాత్రి చలో రాజమండ్రి కార్యక్రమానికి పట్టణ టిడిపి నేతలను పోలీసులు అడ్డుకున్నారు. చలో రాజమండ్రి కార్యక్రమంకు వెళ్లకుండా శ్రీనివాసపురంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు స్వగృహంలో రామలింగేశ్వరరావు, ఇతర నాయకులు సమావేశం అవ్వగా పోలీసులు అక్కడకు చేరుకుని ముందస్తు నోటీసులు అందించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు రాగాని రామకృష్ణ, రాగాని శ్రీనివాస్, దళిత నేతలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, మళ్లిపూడి నవీన్ పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

'మళ్లీ జగన్ అధికారంలోకొస్తే ఆస్తులమ్ముకోవాలి'

ఆగిరిపల్లి : మీ బిడ్డనంటూ గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో పెంచిన పన్నులను చూసి రాష్ట్ర ప్రజల కళ్లు తిరుగుతున్నాయని, మరోసారి జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు పన్నులు కట్టడానికి ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని ఈదులగూడెం గ్రామం నుంచి ఆగిరిపల్లి శోభనాచల స్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.శివరామకృష్ణ, ఎం.కోటేశ్వరరావు, కె.మంగయ్య, ఎం.గోపాల్, జె.రాజశేఖర్, ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు
ఇద్దరికి గాయాలు

జీలుగుమిల్లి : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన జీలుగుమిల్లి సబ్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై అశ్వరావు పేట వైపు నుంచి వస్తున్న కారు, జీలుగుమిల్లి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, లక్ష్మీప్రసాద్ అనే ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి వారిని వెంటనే 108లో జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కలుపు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

టి.నరసాపురం : కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర భద్రవరం గ్రామానికి చెందిన నల్లజర్ల వేమయ్య(30) ఈనెల 16వ తేదీన భార్యతో గొడవ పడడంతో పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన వేమయ్య కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి శేషగిరి ఫిర్యాదుతో ఎస్ఐ మాధవ రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

ముదినేపల్లి : వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెయ్యేరు పంచాయతీ శివారు వడ్డేశ్వర్ కాలనీకి చెందిన బండి వెంకటేశ్వరరావు(65) గత నెల 30వ తేదీ ఉదయం బయటకెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అన్ని చోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన భర్త కనబడటం లేదంటూ భార్య బండి ఎర్రమ్మ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వృద్ధుని ఆచూకీ తెలిసినవారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు 9908822556 సమాచారం ఇవ్వాల్సిందిగా కుటుంబ సభ్యులు కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జరిమానా

చింతలపూడి : మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికి భారీ జరిమానా విధించినట్లు చింతలపూడి ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. గ్రామ శివారు ఏలూరు చింతలపూడి రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించగా, పెదవేగి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన వెంట్రుకపాటి కిరణ్ కుమార్ మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతుండడంతో అతన్ని పట్టుకుని, కోర్టు నందు హాజరు పరచగా మేజిస్ట్రేట్ అతనికి రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గుడిపాడులో ఎండిపోయిన వరి పైరుతో రైతు ముత్తయ్య

నరసింహారావు పాలెంలో ఎండిపోతున్న వరిపైరుతో రైతు ఇశ్రాయేలు

ఎండిపోతున్న వరిపైరు..

ఆవేదనలో అన్నదాతలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహారావుపాలెం, గుడిపాడు గ్రామాలలో వరిపైరు వేసిన రైతులు వర్షాలు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ప్రజాశక్తితో రైతు గాల్లపాటి గోపాలరావు మాట్లాడుతూ తనకున్న ఎకరం 50 సెంట్లు భూమిలో వరి పంట సాగు చేస్తున్నాన్నారు. ఈ సంవత్సరం వర్షాలు రాక చాలీచాలని నీటితో, పూర్తిగా భూమి నెర్రలిచ్చి వరి ఎండిపోతున్నదని వాపోయారు. పల్లె ముత్తయ్య రైతు తనకున్న రెండు ఎకరాల భూమిలో వరిపై సాగు చేస్తున్నానన్నారు. అసలే మెట్ట ప్రాంతంగా ఉన్న పొలాలలో వరిపైరు సాగు చేయడం జరుగుతుందని, కనీసం తినటానికైనా గింజలు వస్తే చాలు అనుకుని వరి పైరు సాగు చేస్తున్నాని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు లేని కారణంగా వరి పూర్తిగా ఎండిపోయి, దెబ్బతినడంతో కుటుంబ భారాన్ని ఎలా నెట్టుకు రావాలో అర్థం కావడం లేదని వాపోయారు. సింహపం ఇశ్రాయేలు అనే రైతు ఎకరం భూమిలో పంట పూర్తిగా ఎండి పోవడంతో, పశువులను మేపుకుంటున్నారు. అధిక ఎండలు కారణంగా పూర్తిగా పంట నష్టపోయానని తెలిపారు. పడిన శ్రమంత వృథా అయ్యిందని, ఎరువులు, పురుగు మందులు, గింజల కొనుగోలుకు వేలకు వేలు ఖర్చైందని, అప్పుల ఊబిలో కూరుకుపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన పేద, చిన్నకారు రైతులమైన మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నామని తెలియజేశారు.

నరసింహారావు పాలెంలో ఎండిపోతున్న పొలంలో రైతు గోపాలరావు

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ


నూజివీడులోని యనమదల గ్రామంలోని సురక్షలో ఎంఎల్ఎ అప్పారావు

ముసునూరులోని గుళ్లపూడిలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. మండలంలోని యనమదల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆరేపల్లి శిరీష, జెడ్‌పి వైస్ ఛైర్మన్ కృష్ణంరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఆశ పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చింతలపూడి సచివాలయం కన్వీనర్ తల్లాబత్తుల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వెంకటాద్రిగూడెంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో డెంగ్యూ, మలేరియా, బిపి, షుగరు వంటి 9 రకాల రోగాలకు ఉచిత వైద్యం, మందులు ఇస్తున్నారని తెలిపారు. అనంతరం జెడ్‌పి సిఇఒ రవి కుమార్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, వైసిపి నాయకులు జూజారెడ్డి, ఎంపిటిసి కృష్ణరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలా, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని బొమ్మినంపాడు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య సురక్ష కౌంటర్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, మండల పార్టీ అధ్యక్షులు మెట్లూ ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు శీలం రామకృష్ణ, అల్లూరు ఎంపిటిసి రెడ్డి సతీష్ బాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కోటే గోవిందరాజులు, ఎంపిటిసి దాసరి అరుణ పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్తులందరూ తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చర్యలు చేపట్టాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు హై స్కూల్‌లో సర్పంచి రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, తహశీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అమృత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మువ్వ ప్రశాంతి, వైద్యులు యం.కిరణ్ కుమార్, డాక్టర్ కరిముల్లా పాల్గొన్నారు.

నాయకుల త్యాగాలు మరువలేనివి

ఘనంగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

చింతలపూడి : భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావానికి కృషి చేసినటువంటి నాయకుల త్యాగాలు మరువ లేనివని చింతలపూడి మండల సిపిఐ కన్వీనర్ ఆదెపల్లి నారాయణ తెలిపారు. భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి 103 సంవత్సరాలు అయిన సందర్భంగా చింతలపూడిలో సిపిఐ ఆఫీస్ వద్ద జెండా ఎగురవేసి, 103 సంవత్సరాల కమ్యూనిస్టు చరిత్రను వివరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని పట్టణ శాఖ కార్యదర్శి యస్.సూర్యకుమార్ ఆవిష్కరించి, నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి కృషి చేసిన నాయకులను ఆదర్శంగా తీసుకుని, కార్మిక, కర్షక, మహిళల హక్కులకై నిరంతరం వారి వారసులు స్వచ్ఛందంగా సూర్య కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలని కమ్యూనిస్టు పార్టీలు కోరుకుంటుంటే నేడు మతోన్మాద శక్తులు ప్రజలను మతాలు, కులాల పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటానికి సెక్యులర్ శక్తులు, అభ్యుదయవాదుల మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.సత్యనారాయణ, యస్.జోషి పాల్గొన్నారు.

ప్రజాసేవే పరమావధి : ఎంఎల్ఎ

ఏలూరులో 117, నారాయణపురంలో 103 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజాసేవే పరమావధిగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. ఏలూరు నియోజకవర్గం, 28వ డివిజన్, 51వ డివిజన్ కాలనీలోని అంబికా నగరకు చెందిన 61 మందికి, 49 డివిజన్ నాని నగర్‌కు చెందిన 56 మందికి, మొత్తం 117 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆళ్ల నాని చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా స్థిర నివాసం ఉంటున్న పేదలకు వారి నివాస స్థలంపై శాశ్వత హక్కు కల్పించాలని సంకల్పించామని, అర్హులైన లబ్ధిదారులకు వారి ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభై వేల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈమేరకు రాసున్న వేసవిలోగా ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా తాము నివాసం ఉంటున్న ప్రాంతాలపై హక్కు కల్పించి, తమకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయించిన ఆళ్ల నానికి లబ్ధిదారులందరూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్.పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేశ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రతిఒక్కరి సొంతింటి కల సాకారం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించుకున్నారని ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు తెలిపారు. మంగళవారం నారాయణపురంలో 103 మంది లబ్ధిదారులకు స్థలాలను కేటాయించి, వారికి పొజిషన్ సర్టిఫికెట్ అందజేశారు. అందరూ ఇళ్ళ నిర్మించుకుంటే ప్రభుత్వపరంగా అందాల్సిన బిల్లులు, డ్వాక్రా రుణం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎవి.రమణారావు, హౌసింగ్ ఎఇ సురేష్ బాబు, వైసిపి మండల కన్వీనర్ మరడా మంగారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి : వ్యకాస

నేడు ఉపాధిహామీ చట్టం పరిరక్షణపై సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడటం కోసం, పని దినాలు, వేతనాల పెంపుకై ఏలూరులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఉపాధి హామీ సమస్యల పరిష్కారించడం కోసం ఈనెల 18వ తేదీ జిల్లాలోని ఏలూరు శ్రీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మండలంలోని పట్టెన్నపాలెం గ్రామంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు జోడే సూర్యచంద్రరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఉపాధి హామీ చట్టానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా రూ.600 వేతనం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, కేరళ ఎంపీ కామ్రేడ్ శివ దాసన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ ప్రచారంలో మండల కార్యదర్శి ఎ.ప్రభాకర రావు, కె.సుబ్బారావు, రాముడు, పూసం దరా పాల్గొన్నారు.

అగాపె సేవా సంస్థ ఆధ్వర్యంలో వినికిడి యంత్రం వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక అగాపే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వినికిడి సమస్యతో ఉన్నవారికి వినికిడి యంత్రం ఉచితంగా అందజేశారు. మంగళవారం అగాపే స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బిరుదు గడ్డ అబిఆబు నివాసం వద్ద సమస్యతో బాధపడుతున్న పోతన అప్పారావుకు వినికిడి యంత్రాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆబిఆబు మాట్లాడుతూ దాంగి నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రకాశరావు సూచన మేరకు వినికిడి సమస్యతో బాధపడుతున్న అప్పారావుకు వినికిడి యంత్రాన్ని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు షేక్ సుభానీ, దాంగినగర్ అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి పటాన్ బాజీ, సహాయ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.

రూ.87 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

జంగారెడ్డిగూడెం : స్థానిక సూర్య కాలేజీ రోడ్డు నిర్మాణానికి రూ.87 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించినట్లు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తెలిపారు. మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

CHANGE OF NAME
I PUCHAKAYALA NARENDRABABU S/O PUCHAKAYALA DAVEEDU RAJU DOOR NO. 3-32, BALLIPADU GARUVU, PALAKOL MANDALAM, W.G.DT.AP, I HAVE CHANGED MY NAME FROM PUTCHAKAYALA NARENDRABABU (OLD NAME) TO PUCHAKAYALA NARENDRABABU (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE CONTINUE WITH MY NEW NAME PUCHAKAYALA NARENDRABABU

పార్టీషన్ డీడ్ మిస్సింగ్
అయ్యా, నేను ఇరగవరపు సిద్ధార్థ, ఇంటి నెంబరు బి-601, ఫేస్-2, వనస్థలిపురం, హైదరాబాద్ తెలియజేయునది ఏమనగా నాకు సంబంధించిన పార్టీషన్ డీడ్ డాక్యుమెంటు నెం. 1787/2004, 9/10 సర్వే నెంబరు, సబ్జప్పరం, అంకుకు చెందిన డాక్యుమెంటు డి.టి.సి.ఫ్యాక్టరీ నుండి ఇల్లింద్రప్రకు వస్తుండగా ది.18-08-2023 నాడు ఇరగవరంలో మిస్ అయినది. ఇందునిమిత్తం ఎవరికైనా దొరికిన ఎడల పై అడ్రసుకు తెలియజేయగలరు.
సిద్ధార్థ ఇరగవరపు
బి-601, ఫేస్-2, వనస్థలిపురం, హైదరాబాద్, తెలంగాణ - 500070
సెల్: 89198 03123
పి.సురేష్
అడ్వకేట్, తణుకు, ప.గో.జిల్లా.
సెల్: 99129 31046

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జిల్లా కోర్టు :: ఏలూరు
ఇ.పి.నెం.1496/2018
ఇన్ ఎ.ఆర్.సి.నెం. 150/2015
డిక్రీదార్: మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఏలూరు. ...డి. హెచ్. ఆర్
మరియు
ఎస్.రామకృష్ణంరాజు మరియు ఇతరులు ...జె.డి.ఆర్
ఇందు పై నెంబరు ఇ.పి. గ్రంథములో ఈ క్రింది షెడ్యూలు జె.డి.ఆర్-2 అయిన ఎస్.సుధారాణి గారి ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము ది.08-11-2023వ తేదిన ఉదయం గం॥ 10:30 నిలకు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. పబ్లికేషన్ ద్వారా తెలియపరచడమైనది.
Schedule: West Godavari District, Eluru Sub District, Eluru Mandalam, Eluru Non-Municipal Area, Venkatapuram Gram Panchayat, Eluru Block No.2, R.S.No. 746/3, Out of total extent of Ac. 3.53 cents, Westren side an extent of Ac.1.21 1/4th cents after seeling Ac.0.50 cents remaining extent Ac.0.71 1/4 cents in which an extent of 600 Sq. Yards or 501.678 Sq. Mtrs Vacant site bounded by: East: Road. South: Site of Gottapu Venkata Rao and N.Chenchaiah. West: Road. North: Site of Hari Narayana and Dasari Prasad.
With all easementary rights over the schedule property for ingres or egress.
D.H.R.Value : Rs.20,00,000/-
Amin Value : Rs.30,00,000/-
(2వ అదనపు జిల్లా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.N.R.GOPAL
Advocate, Eluru.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఒ.ఎస్.నెం. 679/2023
ఇన్ ఓ.ఎస్.నెం.29/2022
డిక్రీదార్: ప్రజు డిపోట్ పెట్రోలియమ్స్ హోల్ సేల్ & రిటైల్ ప్రొ: చిన్ని లక్ష్మినారాయణ. ...పిటీషనర /వాది
అండ్
1) మురళీ కృష్ణ ట్రేడర్స్, ప్రొ: కలగర మురళీకృష్ణ.
2) కలగర మురళీ కృష్ణ ...రెస్పాండెంట్సు /ప్రతివాది
రెస్పాండెంట్సు /ప్రతివాది: 1) మురళీ కృష్ణ ట్రేడర్స్, డో.నెం.1/49, మెయిన్ రోడ్, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప.గో.జిల్లా /ఏలూరు జిల్లా, ఆంధ్ర.
2) కలగర మురళీ కృష్ణ, తండ్రి: భాస్కరరావు, లింగపాలెం మండలం, ములగలంపాడు - 534462, ప.గో.జిల్లా /ఏలూరు జిల్లా, ఆం॥ప్ర.
పై నెంబరు గ్రంథమునందు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపియున్నాను నోటీసులను ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారంగా ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై గ్రంథములో సదరు పై గ్రంథమునకు ది.02-11-2023 వాయిదా తేదీయగు ఉన్నది. కావున సదరు వాయిదాకు మీరు గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట ది.02-11-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 నిలకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయి మీయొక్క అక్షేపణలు తెలియజేసుకోగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
మేడిది చిన్ని కృష్ణమాచార్యులు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 70360 76151

దస్తావేజులు పోయినవి
నా క్లయింటు ది.16-10-2023వ తేదీన, ఏలూరు మండలం, మాదేపల్లి గ్రామం, డో.నెం. 1-54లు కాపురస్తులు తురక (లేటు) వెంకటేశ్వర్లు గారి కుమారుడు తురక అచ్చన్న, వయస్సు 44 సం॥లు, తన ఇంటికి సంబంధించిన ఆస్తి పత్రములు తీసుకొని ఏలూరులో పెదపోస్టాఫీసు సెంటరుకు జిరాక్సు కాపీలు తీసుకునుటకు వచ్చినారు. తన ఆస్తికి సంబంధించిన (లింకు దస్తావేజు ఒరిజినల్) ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్ట్రు కాబడిన పార్టీశన్ దస్తావేజు నెం. 4187/1997ను గల ఒరిజినల్ దస్తావేజు పోయినది. మరియు నా ఒరిజినల్ ఆధార్ కార్డు పోయినది. నా క్లయింటు ఎంత వెతికినను సదరు దస్తావేజు దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికి అయినను దొరికిన ఎడల పైన తెలిపిన నా క్లయింటు అడ్రసుకు దస్తావేజు ఇచ్చిన ఎడల తగిన పారితోషకము ఇప్పించబడును అని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
వానపల్లి అప్పారావు
అడ్వకేట్, పవరు వీధి, ఏలూరు. సెల్:94403 09669
17-10-23. నా క్లయింటు సెల్ నెం.: 93468 56669

In The Court Of The Principal Junior Civil Judge :: Nidadavole
I.A.No.511/2022, O.S.No.102/2022
Between:
Ketanapalli Gopinadh,S/o. Late Subba Rao, Male, R/o. Main Road, Brahmana Gudem, Chagallu Mandal, E.G.Dist.
...Petitioner /Plaintiff
AND
Javvadi Ratna Kumar, S/o. Srinivasa Rao, 30 Years, Male, Business, D.No. 6-180, Rayalam, Totaboyina Vari Street, China Amiram, Bhimavaram Mandal, W.G.Dist.
...Respondent /Defendant
పై నెంబరు ఐ.ఎ.లో మరియు దావాలో ప్రతివాది ఎన్నిపర్యాయములు పై కోర్టు వారు జారీ చేసిన సమన్లు మరియు నోటీసులు పంపినను, ప్రతివాది Evade చేస్తున్న కారణం చేత ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా ప్రతివాదికి ది.30-10-2023వ తేదీన వాయిదా అని తెలియజేయడమైనది. సదరు వాయిదాకు ప్రతివాది పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరయ్యి తన వాదనను తెలుపుకోవలెను. లేని ఎడల అతనిని Exparte చేసి పరిష్కారము తదుపరి గ్రంథము జరుపబడునని తెలియజేయడమైనది.
NANDIGAM SUBBA RAO
Advocate, Nidadavole. Cell: 924756 63882

CHANGE OF NAME
I VAKAPALLI PRABHU DASU S/O VAKAPALLI APPALA SWAMI (LATE) D.NO 20-90, PITHANI VARI STREET, MOGALTURU, MOGALTURU (M), W.G.DT.AP, I HAVE CHANGED MY NAME FROM VAKPALLI PIRBHU DASU (OLD NAME) TO VAKAPALLI PRABHU DASU (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE CONTINUE WITH MY NEW NAME VAKAPALLI PRABHU DASU.

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No. 241-247/ General & UPHC /2023-24, Dated: 17-10-2023
The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for "Construction of CC Roads, BT Road, Construction of Shop Rooms and Automatic Waste Processing Plant in Municipal Corporation, Eluru" Total No of works is 7 with an amount of Rs.51.70 Lakhs.
Tender schedules are available on e-procurement market place from 19-10-2023. Last date of receipt of tenders is 25-10-2023. Further details can be seen at e-procurement market place at www.apeprocurement.gov.in or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)
Sd/- COMMISSIONER, Municipal Corporation, Eluru